సాక్షి వికారాబాద్

శనివారం । 4 । ఫిబ్రవరి । 2023



ఆలు సాగు.. భలేబాగు

ఆలు సాగుతో తక్కువ సమయంలో అధిక దిగుబడులను పొందవచ్చని ఉద్యాన శాఖ అధికారి గఫూర్ అన్నారు. 8లో▸



నిర్లక్ష్యానికి నాలుగేళ్లు!

భారీ వర్షాలకు దెబ్బతిన్న వంతెన స్థానంలో చేపట్టిన నూతన బ్రిడ్జి నిర్మాణ పనులు నాలుగేళ్లుగా కొనసాగుతున్నాయి. 9లో▸

నగరానికి చేరుకున్న ఈ-రేసింగ్ ఎస్కార్ట్ వాహనాలు

శంశాబాద్: ఈ-రేసింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఎస్కార్ట్‌గా వినియోగించే కార్లు హైదరబాద్ నగరానికి చేరుకున్నాయి. శుక్రవారం ఉదయం రియాద్ నుంచి కార్గో విమానంలో వచ్చిన ఐదు ఎస్కార్ట్, రెస్క్యూ కార్లను శంషాబాద్ జీఎంఆర్ కార్గో టెర్మినల్‌లో ప్రత్యేక కార్గో హ్యాండ్లింగ్ యంత్రాల ద్వారా ప్రక్రియ పూర్తి చేశారు. అనంతరం కస్టమ్స్ ప్రక్రియను పూర్తి చేసి ట్రాన్స్‌పోర్ట్ ద్వారా హైదరాబాద్‌కు పంపించారు.

న్యూస్‌రీల్

భాషా పండితులను అప్‌గ్రేడ్ చేయాలి



కోట్‌పల్లి కేజీబీవీలో ఉపాధ్యాయులతో వేణుగోపాల్ తదితరులు

బంట్వారం: భాషా పండితులను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లోని పలు పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన పీఆర్‌సీ అమలు కోసం వెంటనే కమిటీ వేయాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘మోడల్’లో ప్రవేశాలకు 15 వరకు గడువు

మర్పల్లి: ఆదర్శ పాఠశాలలో (2023- 24 విద్యాసంవత్సరం) ప్రవేశాల కోసం ఈ నెల 15వ తేదీ వరకు గడువు ఉందని మర్పల్లి ఆదర్శ పాఠశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ కృష్ణ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో అడ్మిషన్లతో పాటు 7నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆరో తరగతిలో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 16న ఆదివారం ఉదయం 10నుంచి 12 గంటల వరకు, 7నుంచి పదో తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఇదే రోజున మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. మే 15న ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గెస్ట్ లెక్చరర్స్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: షాద్‌నగర్ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల (నాగర్‌కర్నూల్)లో బోధించేందుకు గెస్ట్ లెక్చరర్స్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుజాత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఫిజిక్స్, బోటనీ సబ్జెక్టులను బోధించేందుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ అర్హత కలిగి ఉండాలని, రూ.25వేల వేతనం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తులను ఈ నెల 7వ తేదీలోపు కళాశాలలో సమర్పించాలని సూచించారు. అభ్యర్థులకు ఇంటర్వ్యూ, డెమోలను నూర్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

చేవెళ్ల: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేషన్ ఈడీ ప్రవీణ్ అన్నారు. డివిజన్‌లోని నాలుగు మండలాల లబ్ధిదారులకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ ద్వారా వివిధ రకాల రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు.

పని చేసేవారికే ‘జాబ్’

- ఉపాధి హామీ జాబ్ కార్డుకు ఆధార్ లింక్
- 99శాతం ప్రక్రియ పూర్తి
- అవకతవకలకు చెక్ పెట్టేందుకు కేంద్రం నిర్ణయం
- ఇన్‌యాక్టీవ్ కూలీలను గుర్తిస్తున్న సిబ్బంది



పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

వికారాబాద్ అర్బన్: జాతీయ ఉపాధి హామీ పథకంలో జరిగే అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త విధానాలను అమలు చేస్తోంది. గ్రామాల్లో చాలా మందికి జాబ్ కార్డులున్నా ఏడాదిలో ఒక్క రోజు కూడా పనికి వెళ్లని వారున్నారు. ఇలాంటి వారిని ఇన్‌యాక్టీవ్‌గా గుర్తిస్తున్నారు. కొందరికి రెండేసి జాబ్ కార్డులు ఉండగా.. మరికొందరు పనులు చేయకపోయినా స్థానికంగా ఉండే ఫీల్డ్‌అసిస్టెంట్, పంచాయతీ సెక్రటరీల సహకారంతో హాజరు వేయించుకుంటూ కూలి డబ్బులు తీసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఇలాంటి అవకతవకలను అరికట్టాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జాబ్ కార్డుకు ఆధార్ లింక్ చేయాలనే నిబంధన తీసుకొచ్చింది.

మండలం	జాబ్‌కార్డులు	ఆధార్ లింక్ అయినవి	కానివి
బంట్వారం	9,126	9,075	51
బషీరాబాద్	12,332	12,230	102
బొంరాస్‌పేట్	12,017	11,922	95
ధారూరు	17,288	17,213	75
దౌల్తాబాద్	15,798	15,744	54
దోమ	14,289	14,174	115
కొడంగల్	12,945	12,913	32
కోట్‌పల్లి	11,165	11,149	16
కుల్కచర్ల	18,141	17,989	152
మర్పల్లి	17,355	17,311	44
మోమిన్‌పేట	13,157	13,155	02
నవాబుపేట	12,955	12,950	05
పరిగి	12,338	12,195	143
పెద్దేముల్	17,884	17,805	79
పూడూరు	1,1850	11,792	58
తాండూరు	11,413	11,319	47
వికారాబాద్	11,366	11,319	47
యాలాల	15,934	15,872	62

లక్ష మందికిపైగా..

కూలీల హాజరు నమోదు కోసం ఇప్పటికే మొబైల్ మానిటరింగ్ సిస్టంను అమలు చేస్తున్నారు. డబ్బుల చెల్లింపుల కోసం కేంద్ర ప్రభుత్వం ఇటీవల కొత్త విధానాన్ని అమలులోకి తీసుకువచ్చింది. జాబ్ కార్డును ఆధార్‌తో అనుసంధానం చేయాలని నిర్ణయించింది. దీంతో పనులకు వెళ్లని వారిని గుర్తించి జాబ్‌కార్డులు తొలగించాలని భావిస్తోంది. జిల్లాలో 3,70,672 జాబ్ కార్డులు ఉండగా, 1,23,319 మంది ఇన్‌యాక్టీవ్‌గా ఉన్నట్లు గుర్తించారు. వీరిలో జాబ్ కార్డు తీసుకున్న రోజు నుంచి ఇప్పటివరకూ ఒక్క రోజు కూడా పనిచేయని వారుండగా.. కొంత కాలంగా ఉపాధి కూలీకి వెళ్లని వారిని పరిగణనలోకి తీసుకున్నారు. రెండు చోట్ల జాబ్ కార్డులు ఉన్న వారి వివరాలను సైతం నమోదు చేసుకున్నారు. గత నెలలో ప్రారంభమైన ఆధార్ సీడింగ్ జిల్లాలో 99శాతం పూర్తయింది.

16వేల మందికి ఇబ్బంది

ఇన్‌యాక్టీవ్ జాబితాలో ఉన్న 16,234 మంది ఉపాధి కూలీలకు చెందిన జాబ్ కార్డు, ఆధార్ కార్డు వివరాలు సరిపోలడం లేదు. దీంతో ప్రస్తుతం వీరు ఉపాధి పొందే అవకాశం లేదు. వీరంతా 2008 నుంచి 2010 మధ్యకాలంలో జాబ్ కార్డులు తీసుకున్నారు. ఆ తర్వాత వచ్చిన ఆధార్‌లో వివరాలు జాబ్ కార్డులో ఉన్న వివరాలు తేడాగా ఉన్నాయి. వీటిని సరిచేసేందుకు కొంత సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు.

ఆధార్ లింక్ అయితేనే..

ఉపాధి హామీ కూలీలకు ప్రస్తుతం పోస్టల్, బ్యాంకుల ద్వారా డబ్బులు చెల్లిస్తున్నారు. గ్రామాల్లో పలుకుబడి ఉన్న కొందరు పనులకు వెళ్లకపోయినా హాజరు వేయించుకుని, డబ్బులు పొందుతున్నారు. ఈ విషయాన్ని ఇటీవలే పసిగట్టిన కేంద్రం చెల్లింపులలో పారదర్శకత తీసుకువచ్చేలా చర్యలు చేపట్టింది. కూలీల చెల్లింపుల్లో అక్రమాలను అడ్డుకునేందుకు ఆధార్ బేస్డ్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఇందులో భాగంగానే జాబ్ కార్డుకు ఆధార్‌ను అనుసంధానం చేస్తోంది.ఈ విధానం అమలుతో పనులు చేసిన వారికి మాత్రమే కూలీ డబ్బులు జమకానున్నాయి.

2.47 లక్షల మంది

జిల్లాలో 2,47,353 మందిని మాత్రమే యాక్టీవ్ కూలీలుగా గుర్తించారు. ప్రస్తుతం 2,46,218 జాబ్ కార్డులకు ఆధార్ లింక్ పూర్తి చేశారు. జాబ్‌కార్డు, ఆధార్ కార్డులో ఉన్న పొరపాట్లను సరిచేస్తే అర్హుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

మార్పులకు అవకాశం



ఆధార్, జాబ్ కార్డులో ఉన్న వివరాలు సరిపోకలకపోవడంతో చాలా మంది జాబ్ కార్డులు తిరస్కరణకు గురవుతున్నాయి. దీనిపై గతంలోనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాం. వీటి సవరణకు అవకాశం ఉంటుంది. అర్హులైన కూలీలు ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఆధార్ లింక్ చేసిన వారికే ఖాతాలో కూలి డబ్బులు జమవుతాయి.

– కృష్ణన్, పీడీ, డీఆర్‌డీఏ



కింద కూర్చుని దివ్యాంగుడైన ఉద్యోగి నుంచి బొకే తీసుకుంటున్న కలెక్టర్ నారాయణ్‌రెడ్డి

మర్యాద నారన్న

- కలెక్టర్ హుందాతనంపై ఉద్యోగుల హర్షం
- అనంతగిరి పూజారులు, మంత్రి ఆశీర్వాదం



మంత్రి సబితారెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తూ..

వికారాబాద్: కలెక్టర్ నారాయణ్‌రెడ్డి శుక్రవారం బిజీబిజీగా గడిపారు. నగరంలోని మంత్రి సబితారెడ్డి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా ఆమెను కలిశారు. ఆతర్వాత కలెక్టరేట్‌లో తనను కలిసేందుకు వచ్చిన కార్యాలయ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలను పరిచయం చేసుకున్నారు. కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న దివ్యాంగుడైన ఓ కంప్యూటర్ ఆపరేటర్ ఆయనకు పూల బొకే ఇచ్చేందుకు రాగా.. సీట్లోనుంచి వచ్చిన కలెక్టర్ అతనితో పాటు కింద కూర్చుని బొకే తీసుకున్నారు. దీంతో మిగతా ఆపరేటర్లు కూడా కలెక్టర్ పక్కన కూర్చుని శుభాకాంక్షలు తెలిపారు. ఆయన హుందాతనానికి ముగ్ధులయ్యారు. అనంత పద్మనాభ స్వామి ఆలయ పూజారులు వచ్చి కలెక్టర్‌ను ఆశీర్వదించారు. తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కలెక్టర్‌ను కలిసి సన్మానించారు.



కలెక్టర్‌ను ఆశీర్వదిస్తున్న అనంతగిరి ఆలయ పూజారులు



సంగీత విద్వాంసురాలు సుధా రఘునాథన్‌కు బహుమతిని అందిస్తున్న గురూజీ కమ్లేష్ పటేల్

త్వరలోనే శనగ కొనుగోలు కేంద్రాలు

బషీరాబాద్: వారం రోజుల్లో జిల్లాలో శనగ కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని డీఏఓ గోపాల్ తెలిపారు. క్వింటాలుకు రూ.5,335 ప్రభుత్వ మద్దతు ధరతో సొసైటీల ద్వారా సేకరిస్తామని చెప్పారు. శుక్రవారం బషీరాబాద్ మండలం గంగ్వార్, క్యాద్గీరాలో పర్యటించిన ఆయన రబీలో సాగు చేసిన జొన్న, కుసుమ, శనగ, వేరుశనగ పంటలను పరిశీలించారు. వీటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారా..? లేదా..? అని తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. జిల్లాలో పంటల నమోదు ఇప్పటికే పూర్తయిందని తెలిపారు. దిగుబడికి తగిన మేర కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేస్తామని స్పష్టంచేశారు. రైతులు పండించిన పత్తిని ఇప్పటికీ ఇళ్లల్లోనే నిల్వ చేశారని, సరైన ధర వస్తే అమ్ముకోవాలని సూచించారు. ఈకేవైసీ చేసుకోని రైతులు వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. ఆయన వెంట ఏఈఓలు పవన్‌కుమార్, నవీన్, రైతులు పాల్గొన్నారు.



గంగ్వార్‌లో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న డీఏఓ గోపాల్

‘అవిశ్వాస’ ఉత్కంఠ!

కోర్టు పరిధిలో మున్సిపల్ పంచాయితీ

- స్టే తెచ్చుకున్న చైర్‌పర్సన్లు
- ఇంప్లీడ్ పిటిషన్ వేసేందుకు అసంతృప్త నేతల ప్రయత్నం
- సవరణ బిల్లుకు గవర్నర్ ఆమోదంపైనే అందరి దృష్టి
- ఇదే జరిగితే చైర్‌పర్సన్లకు ఊరట.. అసంతృప్తులకు ఆశాభంగం



వికారాబాద్ చైర్‌పర్సన్ మంజుల



తాండూరు చైర్‌పర్సన్ స్వప్న



తాండూరు మున్సిపల్ కార్యాలయం

వికారాబాద్: మున్సిపాలిటీల్లో అవిశ్వాసం ఉత్కంఠ రేపుతోంది. వికారాబాద్, తాండూరుకు చెందిన చైర్‌పర్సన్లను గద్దె దించేందుకు వీరి వ్యతిరేకవర్గం అవిశ్వాసం నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. అవిశ్వాస గడువును నాలుగేళ్లకు పొడిగిస్తూ ప్రభుత్వం రూపొందించిన చట్ట సవరణ బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉండటంతో టెన్షన్ నెలకొంది. ఇదే సమయంలో గవర్నర్, ప్రభుత్వం తరపు న్యాయవాదులు రాజీపడటంతో ఇరువర్గాల మధ్య సయోధ్య కుదిరింది. దీంతో బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం కూడా పూర్తయింది. మున్సిపాలిటీల్లో నాలుగేళ్ల వరకు అవిశ్వాసం పెట్టే వీలులేకుండా ప్రభుత్వం రూపొందించిన బిల్లుకు పరోక్షంగా ఆమోదం లభించినట్లయింది. ఇవాలో రేపో దీనికి ఆమోద ముద్ర పడటం ఖాయమనే సంకేతాలు వస్తున్నాయి. ఇదే జరిగితే అవిశ్వాసం ఎదుర్కోవాల్సిన తాండూరు, వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్లకు ఊరట లభించే అవకాశం ఉంది.

కోర్టు కెక్కిన పంచాయితీ...

పురపాలికల్లో అవిశ్వాస తీర్మానాల అంశం గడిచిన వారం రోజులుగా టెన్షన్ రేపుతోంది. మూడేళ్లు పూర్తయిన వెంటనే అవిశ్వాసం పెట్టేందుకు వీలుకల్పించే మున్సిపల్ చట్టాన్ని నాలుగేళ్లకు పొడిగిస్తూ ప్రభుత్వం చట్ట సవరణ చేసిన విషయం తెలిసిందే. ఈ బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉండగానే.. మూడేళ్లు పూర్తయిన మరుసటి రోజే వికారాబాద్, తాండూరు మున్సిపాలిటీలకు చెందిన పలువురు కౌన్సిలర్లు.. ఇరువురు చైర్‌పర్సన్లపై అవిశ్వాస తీర్మానం పెడుతూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీన్ని సవాలు చేస్తూ చైర్‌పర్సన్లు కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. స్టే ఎత్తివేయించేందుకు వైరివర్గం నేతలు ఇంప్లీడ్ పిటిషన్ వేసేందుకు ప్రయత్నిస్తుండగా.. అవిశ్వాస గడువు పొడిగింపు బిల్లుకు ఈరోజో, రేపో గవర్నర్ ఆమోద ముద్ర పడనుందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అసంతృప్త కౌన్సిలర్లు నిరాశకు గరవుతున్నారు.

ఎమ్మెల్యేలకు సవాలే..

పురపాలికల్లో అవిశ్వాసం అంశం ఎమ్మెల్యేలకు సవాలుగా మారింది. వికారాబాద్, తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ల మార్పు అంశంలో జిల్లాలోని రెండు పెద్ద మున్సిపాలిటీల్లో అధికార పార్టీ కౌన్సిలర్లు, చైర్‌పర్సన్ వర్గాల మధ్య రాజకీయం వేడెక్కింది. పురపాలికలు కొలువుదీరి మూడేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఫిఫ్టీ ఫిఫ్టీ ఒప్పంద మున్సిపాలిటీల్లో అధికార బదలాయింపు అంశం చర్చకు వచ్చింది. ఈ రెండు మున్సిపాలిటీల్లో రెండున్నర ఏళ్ల చొప్పున చైర్‌పర్సన్ పీఠాన్ని పంచుకోవాలని ఒప్పందం ఉండగా.. కుర్చీ దిగేది లేదంటూ ప్రస్తుత చైర్‌పర్సన్లు భీష్మించారు. దీంతో అధికార బదలాయింపు అమలుకు నోచుకోలేదు. మున్సిపల్ చట్టం ప్రకారం మూడేళ్ల పదవీ కాలం తర్వాత అవిశ్వాస తీర్మానం పెట్టే వీలుండటంతో ఒప్పంద ఆశావాహులు ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు. రెండు చోట్లా స్థానిక ఎమ్మెల్యేలు వీరికి అండగా నిలుస్తున్నారు. కానీ గవర్నర్ వద్ద బిల్లు ఆమోదం పొందితే ఆశాభంగం తప్పదు. అసంతృప్త నాయకులను మరో ఏడాది పాటు సముదాయించడం ఎమ్మెల్యేలకు తలనొప్పిగా మారే అవకాశముంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎలా నెట్టుకురావాలనేది వీరికి ఇబ్బందిగా మారింది.

ధ్యానంతో ఒత్తిడి దూరం

నందిగామ: నిరంతర ధ్యానం ద్వారా తనను తాను తెలుసుకోవడంతో పాటు మానసిక ఒత్తిడిని అవలీలగా జయించవచ్చని శ్రీరామచంద్ర మిషన్ గురూజీ కమ్లేష్ పటేల్ అన్నారు. మండల పరిధిలోని కాన్హా శాంతి వనంలోని శ్రీ రామచంద్ర మిషన్‌లో పది రోజులుగా కొనసాగుతున్న లాలాజీ మహరాజ్ 150వ జయంతి వేడుకలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ధ్యాన శిబిరంలో గురూజీ కమ్లేష్ పటేల్ (దాజీ) మాట్లాడుతూ.. లాలాజీ సూచించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని పిలుపునిచ్చారు. ఆత్మను శుద్ధి చేసుకునేందుకు ధ్యానం చేయడం నిత్య జీవితంలో అలవాటుగా చేసుకోవాలని సూచించారు. ఆకు పచ్చని కాన్హా శాంతి వనంలో దేశ విదేశాలకు చెందిన అభ్యాసీలతో పది రోజులుగా వేడుకలను సగర్వంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ప్రముఖ సంగీత విద్వాంసురాలు సుధా రఘునాథన్ స్వర పఠనం పలువురి అభ్యాసీలను విశేషంగా అలరించింది.

సాగులో ఆధునిక సాంకేతికత మేలు



సదస్సులో పాల్గొన్న అతిథులు, అధ్యాపకులు, విద్యార్థులు

చేవెళ్ల: వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత పెరగాలని రిటైర్డ్ ఐఏఎస్ రాంపుల్లారెడ్డి, సీడ్ వర్క్స్ ఇంటర్నేషనల్ సీఈఓ డాక్టర్ వెంకట్‌రామ్ అన్నారు. ఊరేళ్ల సమీపంలోని సాగర్ విద్యాసంస్థల్లో శుక్రవారం వ్యవసాయ వ్యాపారం- ఆధునిక పద్ధతులు అంశంపై జాతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. దేశవ్యాప్తంగా పలు సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొని వ్యవసాయ రంగంతోపాటు వ్యవసాయ ఆధారిత వాణిజ్య రంగంలో వస్తున్న మార్పులు, సాంకేతికత వాడకం, విలువల ఆధారిత పరిశ్రమలపై చర్చించారు. దేశంలో కరోనా తరువాత వ్యవసాయ రంగంలో పెను మార్పులు వచ్చినట్లు తెలిపారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడంపై మరిన్ని పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కూలీల వినియోగం తగ్గించి యంత్ర పరికరాల వాడకం పెరగాల్సి ఉందన్నారు. వ్యవసాయంలో డ్రోన్‌ల ఉపయోగం ఇంకా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఆధునిక సాంకేతిక పద్ధతులను వినియోగించి వ్యవసాయాన్ని లాభాల బాటలో నడిపించాల్సి ఉందన్నారు. వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు తమ అధ్యయనాలను వివరించారు. ఉత్తమ అధ్యయనాలను గుర్తించి బహుతులు అందజేశారు. కార్యక్రమంలో సాగర్ విద్యాసంస్థల కార్యదర్శి మాలతి, డైరెక్టర్ డాక్టర్ సురేశ్, డీన్ సాహు, నిర్వాహకులు డాక్టర్ రామ్‌నరేశ్, మహిపాల్‌రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంబేడ్కర్‌ విగ్రహావిష్కరణకు ఆహ్వానం



ఎమ్మెల్యే ఆనంద్‌తో చౌడాపూర్‌ మండల నాయకులు

కుల్కచర్ల: చౌడాపూర్‌ మండలం పుర్సంపల్లిలో ఈ నెల 11న నిర్వహించే అంబేడ్కర్‌ విగ్రహావిష్కరణకు వికారాబాద్‌ ఎమ్మెల్యే డాక్టర్‌ మెతుకు ఆనంద్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ ప్రతీ ఒక్కరూ అంబేడ్కర్‌ ఆశయ సాధనకు కృషిచేయాలన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పుర్సంపల్లి సర్పంచ్‌ వెంకటయ్య, స్థానిక అంబేడ్కర్‌ సంఘాల నేతలు తదితరులున్నారు.

‘ఉపాధి’కి 17 ఏళ్లు



ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ ఉద్యోగులతో కలిసి కేక్‌ కట్‌ చేస్తున్న కలెక్టర్‌

వికారాబాద్‌ అర్బన్‌: జాతీయ ఉపాధి హామీ పథకం ప్రారంభించి 17 ఏళ్లు పూర్తికావడంతో కలెక్టర్‌ నారాయణ్‌రెడ్డి ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ సిబ్బందితో కలిసి కేక్‌ కట్‌ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో పనిచేసే ఉద్యోగులకు గ్రామీణ ప్రాంతాల్లో ఉండే సమస్యలపై పూర్తి అవగాహన ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ కృష్ణన్‌, టెక్నికల్‌ అసిస్టెంట్స్‌ సుధాకర్‌, శ్రీనివాస్‌, రాములు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలో చేర్చాల్సిందే



పోలీసుల అదుపులో వడ్డెర కార్మిక సంఘం నాయకులు

అనంతగిరి: వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని అఖిల భారత వడ్డెర కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీఆర్‌.అంజిలయ్య అన్నారు. రాష్ట్ర కమిటీ చలో అసెంబ్లీకి పిలుపు ఇచ్చిన నేపథ్యంలో నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెర ఫెడరేషన్‌కు ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. పోలీసులు ముందస్తు అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. వడ్డెరలకు మైనింగ్‌ హక్కులు కల్పించాలన్నారు. జీవిత బీమా సౌకర్యాన్ని పెంచాలన్నారు. అర్హులైన వారందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో అనంతరాములు, వెంకటయ్య, అనంతయ్య, ప్రభు, నర్సింహులు, బిచ్చయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే..

- కనులపండువగా లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం
- హాజరైన ప్రజాప్రతినిధులు, భక్తులు



స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

కడ్తాల్‌: మండల కేంద్రంలో లక్ష్మీచెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు బ్యాండు మేళాలతో స్వామివారి తలంబ్రాలు, పట్టువస్త్రాలను ఊరేగించి ఆలయానికి తీసుకువచ్చారు. స్వామి వారికి పట్టు వస్త్రాలను కందికంటి సుధాకర్‌గౌడ్‌ బహూకరించగా, పుస్తె మెట్టెలను కృష్ణమూర్తి అందజేశారు. వేదపండితులు మేళ్లూరి వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ మహోత్సవ వేడుకలను భక్త జనుల గోవిందనామస్మరణ మధ్య కనులపండువగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు జరిపారు. ఆదే విధంగా కల్యాణ మహోత్సవ వేడుకలకు ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, కల్వకుర్తి మున్సిపల్‌ చైర్మన్‌ ఎడ్మసత్యం, ఐక్యత ఫౌండేషన్‌ చైర్మన్‌ రాఘవేందర్‌రెడ్డి, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్‌, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్‌, సింగిల్‌విండో చైర్మన్‌ గంప వెంకటేశ్‌గుప్తా హాజరై ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు. భాస్కర్‌రెడ్డి భక్తులకు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, సేవ్యానాయక్‌, ఎంపీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌, ఉప సర్పంచ్‌ రామకృష్ణ, సింగిల్‌విండో డైరెక్టర్‌ వెంకటేశ్‌, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



హోలీమేరీ ఇంజినీరింగ్‌ కళాశాల కాలేజీ జట్టు



వీబీఐటీ ఇంజినీరింగ్‌ కళాశాల జట్టు

హోరాహోరీగా ‘సాక్షి’ ప్రీమియర్‌ లీగ్‌

SPL SAKSHI PREMIER LEAGUE | SAKSHI | సాక్షి | SAKSHI DIGITAL MEDIA GROUP

ఘట్‌కేసర్‌: ఘట్‌కేసర్‌ మండలం ప్రతాపసింగారంలోని బాబురావు సాగర్‌ క్రికెట్‌ మైదానంలో సాక్షి యాజమాన్యం నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్‌ లీగ్‌–4 (ఎస్‌పీఎల్‌) పోటీలు శుక్రవారం కూడా హోరాహోరీగా జరిగాయి.

విజేతల వివరాలు...

బాబురావు సాగర్‌ క్రికెట్‌ మైదానం–1

- మొదటి మ్యాచ్‌లో ఎస్పీ కాలేజ్‌ 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 145 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్‌ చేసిన ఉస్మానియా యూనివర్సిటీ పీజీ కళాశాల జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 78 పరుగులు చేసి పరాజయం పాలైంది. ఎస్పీ కాలేజీకు చెందిన ఇశాన్‌ 26 బంతుల్లో 75 పరుగులు, ఎడ్వాన్‌ 18 బంతుల్లో 39 పరుగులు చేసి విజయంలో కీలక పాత్ర పోషించారు.
- రెండవ మ్యాచ్‌లో సీఎంఆర్‌–ఎ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 88 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్‌ చేసిన లయోలా డిగ్రీ జట్టు 8.2 ఓవర్లలో 89 పరుగులు చేసి విజయం సాధించింది.
- మూడవ మ్యాచ్‌లో వీబీఐటీ ఇంజినీరింగ్‌ కళాశాల జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 95 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్‌ చేసిన ఏసీఈ ఇంజినీరింగ్‌ కళాశాల జట్టు 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 65 పరుగులు చేసి ఓడిపోయింది.

బాబురావు సాగర్‌ క్రికెట్‌ మైదానం–2

- మొదటి మ్యాచ్‌లో కేఎల్‌ హైదర్‌బాద్‌ జట్టు 10 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 125 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్‌ చేసిన హోలీమేరీ అటానామస్‌ ఇంజినీరింగ్‌ కళాశాల జట్టు 75 పరుగులకు ఆలౌట్‌ అయి ఓడిపోయింది. కేఎల్‌ జట్టు క్రీడాకారుడు అయాశ్‌ 25 బంతుల్లో 61 పరుగులు చేయగా, కౌషిక్‌, షన్ముక్‌ మూడేసి వికెట్లు తీశారు.
- రెండో మ్యాచ్‌లో హోలీమేరీ–ఎ జట్టు 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 134 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్‌ చేసిన వేదా డిగ్రీ–బి జట్టు 10 ఓవర్లలో 110 పరుగులు చేసి ఓడింది. హోలీమేరీ జట్టు క్రీడాకారుడు సర్దార్‌ 19 బంతుల్లో 61 పరుగులు చేశాడు.
- మూడవ మ్యాచ్‌లో అవినాశ్‌ డిగ్రీ కాలేజ్‌ జట్టు 9.4 ఓవర్లలో 91 పరుగులకు ఆలౌట్‌ అయింది. అనంతరం బ్యాటింగ్‌ చేసిన భారత్‌ ఫార్మసీ జట్టు 5 వికెట్లు కోల్పోయి 67 పరుగులు చేసి పరాజయం పాలయింది.

ఆలు సాగు.. భలేబాగు

- తక్కువ కాలంలో అధిక దిగుబడులు
- ఉద్యానశాఖాధికారి సలహాలు, సూచనలు



ఆలు దిగుబడులను సంచుల్లో నింపి..

మోమిన్‌పేట: ఆలు సాగులో తక్కువ సమయంలో అధిక దిగుబడులను పొందవచ్చని, పంట కాలం 90 రోజుల నుంచి వంద రోజుల్లో పంట కోతకు వస్తుందని ఉద్యానశాఖాధికారి గఫూర్‌ పేర్కొంటున్నారు. గత నవంబరు నెలలో విత్తుకొన్న రైతులు ప్రస్తుతం పంట కోతకు వస్తుందన్నారు. జిల్లాలో మోమిన్‌పేట, నవాబ్‌పేట, మర్పల్లి, వికారాబాద్‌ నేలలు ఆలు సాగుకు అనుకూలమన్నారు. జిల్లాలో ఈ నాలుగు మండలాల్లో వెయ్యి ఎకరాలకుపైగానే ఆలును సాగు చేశారని తెలిపారు. ప్రస్తుత సంవత్సరం చలి తీవ్రత తక్కువగా ఉండటంతో దిగుబడులు తగ్గాయన్నారు. ఆలు శీతల పంట కావడంతో గడ్డ ఊరుతున్న సమయంలో ఎంత చలి ఉంటే అంత దిగుబడులు వస్తాయన్నారు. ఆలును తీస్తున్న రైతులకు ఆయన కొన్ని సూచనలు చేశారు. మొక్కలు పసుపు రంగు నుంచి గోధుమ రంగుకు మారి పడిపోతాయని ఆయన తెలిపారు. దుంపలు తీసే నాలుగైదు రోజుల ముందు నీటి తడిని ఇస్తే తవ్వడానికి సులువుగా ఉంటుందన్నారు. దుంపలను తీస్తున్న సమయంలో వాటికి ఎలాంటి దెబ్బ తగులకుండా తీయాలని ఆయన సూచించారు. దుంపలు తీసిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ ఎండలో ఉండకూడదన్నారు. నీడలో ఆరబెట్టాలని ఆయన తెలిపారు. తీసిన దుంపలను నీడలో దుంప పొర గట్టిపడే వరకు ఆరనివ్వాలి. తెగిన, దెబ్బతిన్న, కుళ్లిపోయిన దుంపలను వేరుచేసి, దుంప సైజును బట్టి గ్రేడింగ్‌ చేసి గోనె సంచులలో నింపి మార్కెటుకు తరలించాలని ఆయన సూచించారు. ఎండలో ఆరబెడితే దుంప పచ్చబారి రేటు రాదన్నారు. ప్రస్తుతం మార్కెటులో కిలో రూ.15 నుంచి రూ.18 వరకు ధర పలుకుతుందన్నారు. చలి తీవ్రత తక్కువగా ఉండటంతో దిగుబడులు ఎకరానికి 15టన్నుల వరకు వస్తుందన్నారు. ఆలు పంట కోత కోసం దుకు ఆలు డిగ్గరులు 50శాతం సబ్సిడీపై ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతుకు రూ.15వేలు, పెద్ద రైతులకు రూ.12,500ల సబ్సిడీ ఇస్తారన్నారు.

పది ఎకరాలలో సాగు..



ఎనిమిది ఎకరాలతోపాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని ఆలు సాగు చేశా. చలి తక్కువగా ఉండటం వల్ల దిగుబడులు తగ్గాయి. మార్కెటులో ధర పరవా లేదు. దిగుబడులు తగ్గినా ధర ఉండటంతో నష్టాలు రావు. తక్కువ సమయంలో వచ్చే పంట ఆలు మాత్రమే. అందుకే ప్రతి సంవత్సరం ఆలును సాగు చేస్తా. ప్రస్తుతం పంట కోతకు వచ్చింది.

– రైతు రియాజ్‌, మోమిన్‌పేట

యువకుడిపై దాడి కేసులో ఆరుగురి అరెస్టు

గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్‌ మురళీకృష్ణకు రిమాండ్‌



మురళీకృష్ణగౌడ్‌ను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

తాండూరు: యువకుడిపై శివస్వాములు సాముహికంగా దాడి చేసిన ఘటనలో ఆరుగురిని అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్‌ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. యాలాల మండలం దేవనూర్‌ గ్రామానికి చెందిన మెట్లి నరేశ్‌, శ్రీనావాస్‌ల మధ్య గత నెల 30న వ్యక్తిగత విషయమై గొడవ జరిగింది. శివమాల ధరించిన నరేందర్‌ జోక్యం చేసుకుని గొడవ వద్దు సామరస్యంగా పరిష్కరించుకోవాలని తెలిపారు. దీంతో నరేశ్‌ అనే వ్యక్తి నరేందర్‌ను నెట్టేశాడు. అదే రోజు రాత్రి నరేందర్‌ యాలాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత నెల 31న శివమాలధారులపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ వందలాది మంది శివస్వాములు లక్ష్మీనారాయణపూర్‌ జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. అదే సమయంలో నరేందర్‌పై దాడి చేసిన మెట్లి నరేశ్‌ అక్కడికి రావడంతో దాడికి పాల్పడ్డారు. తనపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారంటూ మెట్లి నరేశ్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో తొమ్మిది మంది శివమాలధారులపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. గురువారం రాత్రి గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్‌ మురళీకృష్ణ ఇంట్లో తలదాచుకున్న బొక్కె నరేందర్‌, నరేందర్‌గౌడ్‌, అరవింద్‌గౌడ్‌, శివకుమార్‌, గణేశ్‌లను అరెస్టు చేశారు.

మురళీకృష్ణ గౌడ్‌ అరెస్టు, రిమాండ్‌

శివస్వాములను దాడికి ప్రేరేపించారన్న కారణంతో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్‌ మురళీకృష్ణగౌడ్‌ను అరెస్టు చేశారు. శుక్రవారం ఉదయం రూరల్‌ సీఐ రాంబాబు, పెద్దేముల్‌ ఎస్‌ఐ రావూఫ్‌లతో పాటు పోలీసులు వెళ్లి మురళీకృష్ణను అరెస్టు చేశారు. అనంతరం ఇంట్లో ఉన్న సీసీ పుటేజీలను స్వాధీనం చేసుకొన్నారు. మురళీకృష్ణను అరెస్టు చేసి తాండూరు డీఎస్పీ కార్యాలయానికి తీసుకెళ్లారు. ఐదుగురు శివస్వాములతోపాటు మురళీకృష్ణను న్యాయమూర్తి ఎదుట హాజరు పర్చిన అనంతరం పరిగి జైలుకు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

పదోన్నతి ఇవ్వకుంటే నోటీచింగ్‌

- నిరసన బాటన భాషా పండితులు
- విద్యార్థుల చదువులకు ఆటంకం
- ప్రభుత్వం స్పందించాలంటున్న సంఘం నాయకులు



జాబ్‌చార్ట్‌ ప్రకారమే బోధన చేస్తామంటూ హెచ్‌ఎంకు విన్నవిస్తున్న భాషా పండితులు

వికారాబాద్‌ అర్బన్‌: పదోన్నతులు పొందడంలో కొన్నేళ్లుగా తీవ్ర వివక్షకు గురవుతున్నామంటూ భాషా పండితులు నో టీచింగ్‌ పేరుతో ప్రత్యక్ష ఆందోళనకు దిగారు. గతంలో ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం చేపడుతున్న పదోన్నతుల్లో తమకు అవకాశం ఇవ్వాలంటూ సహాయ నిరాకరణ రూపంలో నిరసన చేపట్టారు. ఉపాధ్యాయుల బదిలీలు చేపడతామని ప్రభుత్వం కసరత్తు ప్రారంభించగానే భాషా పండితులు జాబ్‌చార్ట్‌ ప్రకారం 6 నుంచి 8వ తరగతి వరకే విధులు నిర్వహిస్తామని హైస్కూల్స్‌లో పనిచేస్తున్నగ్రేడ్‌–2 పండితులు విద్యాశాఖ అధికారులకు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు నోటీసులు అందజేశారు. బుధవారం నాటి నుంచే 9, 10 తరగతులకు హిందీ, తెలుగు బోధన నిలిపి వేశారు. జిల్లాలో సుమారు 300 మంది భాషా పండితులు నో టీచింగ్‌లో పాల్గొంటున్నట్లు సంఘం నాయకులు చెబుతున్నారు.

పరీక్షలు సమీపిస్తున్న వేళ..

9, 10 వార్షిక పరీక్షలు సమీపిస్తున్నాయి. తెలుగు, హిందీ, మరాఠీ, ఉర్దూలో ఎక్కువ మార్కులు స్కోర్‌ చేయాలనే ఉద్దేశంతో ఎక్కువ మంది విద్యార్థులు ఉంటారు. ఇలాంటి సమయంలో భాషా పండితులు బోధన ఆపివేయడం విద్యార్థుల చదువుపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు అంటున్నారు. భాషా పండితుల సంఘాల ఆధ్వర్యంలో రెండు మూడు రోజుల క్రితమే రాష్ట్ర స్థాయిలో విన్నవించినా ప్రభుత్వం నుండి స్పందన లేక పోవడంతోనే నో టీచింగ్‌కు దిగినట్లు చెబుతున్నారు.

ఏళ్లుగా ఎదురు చూపులు..

స్కూల్‌ అసిస్టెంట్‌ ఉపాధ్యాయులతో పాటు పాఠాలు బోధిస్తున్నా గౌరవం, వేతనంలో తమకు న్యాయం జరగడం లేదని భాషా పండితులు వాపోతున్నారు. ఏళ్లుగా పదోన్నతుల కోసం ఎదురుచూడాల్సి వస్తుందని అంటున్నారు. పదోన్నతులు రాక పోవడంతో జూనియర్లుగానే ఉండాల్సి వస్తుందని ఆవెదన చెందుతున్నారు. గతంలో ప్రభుత్వం భాషా పండితులను, పీఈటీలను అప్‌గ్రేడ్‌ చేస్తున్నామని జీఓలు ఇచ్చి అమలు చేయలేదని అంటున్నారు.

ప్రభుత్వం స్పందించాలి



భాషా పండితులు న్యాయబద్ధమైన నిరసనపై ప్రభుత్వం స్పందించాలి. ఎల్‌ఫీ వ్యవస్థనే రద్దు చేయాలి. పదోన్నతులు ఇవ్వక పోవడంతో మా జూనియర్లు సీనియర్లుగా మారుతున్నారు. దీంతో మాకు తీవ్ర నష్టం జరుగుతుంది. ప్రభుత్వం స్పందించే వరకు భాషా పండితుల పోరాటం కొనసాగుతుంది. విద్యార్థులకు నష్టం చేయాలనే ఉద్దేశం మాకు లేదు. మాకు న్యాయం జరగాలనే కోరుతున్నాం.

– ఎం. వెంకటేశ్వర్లు, ఆర్‌యూపీపీ జిల్లా అధ్యక్షుడు

ఆటో నుంచి కిందపడి మాజీ చైర్‌పర్సన్‌ మృతి



కళావతి (ఫైల్‌)

బషీరాబాద్‌: ఆటో నుంచి కింద పడి బషీరాబాద్‌ మార్కెట్‌ కమిటీ మాజీ చైర్‌ పర్సన్‌ గుండేపల్లి కళావతి(58) దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మైల్వార్‌ గ్రామానికి చెందిన కళావతి బషీరాబాద్‌ మండల తొలిమార్కెట్‌ కమిటీ చైర్‌పర్సన్‌గా సేవలందించారు. గురువారం మండలంలోని బాద్లాపూర్‌లో బంధువుల ఇంటికి వెళ్లింది. శుక్రవారం ఆటోలో తిరిగి తాండూరు వస్తుండగా ప్రమాదవశాత్తు నారాయణపూర్‌ గేటు సమీపంలో జారిరోడ్డుపై పడింది. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు బైకులు ఢీ

- ఒకరి మృతి
- ఇద్దరికి గాయాలు

పెద్దేముల్‌: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పెద్దేముల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్‌ఐ అబ్దుల్‌ రవూఫ్‌ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొడంగల్‌ మండలం పర్సాపూర్‌కు చెందిన న్యాయవాది కృష్ణయ్య(40) తాండూరు నుంచి వికారాబాద్‌కు బైక్‌పై వెళ్తున్నారు. మంబాపూర్‌ గ్రామానికి చెందిన ఇసాక్‌, ఆశోక్‌లు బైక్‌పై ఎదురుగా వస్తుండగా ఢీకొన్నాయి. కృష్ణయ్య అక్కడికక్కడే మృతిచెందగా, ఇసాక్‌, ఆశోక్‌లకు తీవ్ర గాయాలు కావడంతో తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కృష్ణయ్య శవాన్ని తాండూరు మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రివాల్వర్‌తో వ్యక్తి హల్‌చల్‌



సోషల్‌మీడియాలో వైరల్‌ అవుతున్న ఫొటో..

దోమ : భూ వివాదంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ వ్యక్తి రివాల్వర్‌ను తన ప్యాకెట్‌ (జేబు)లో పెట్టుకొని ఫొటో దిగి సోషల్‌ మీడియాలో అప్‌లోడ్‌ చేసిన ఘటన వైరల్‌గా మారి కలకలం సృష్టించింది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటన వివరాలిలాఉన్నాయి. మండల పరిధిలోని బడేంపల్లికి చెందిన భాస్కర్‌ అనే వ్యక్తి మోత్కూర్‌ గ్రామానికి చెందిన ఓ భూ వివాదం కేసులో నిందితుడు. ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చిన ఆయన ఓ రివాల్వర్‌ పెట్టుకొని ఫొటో దిగడంతో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యక్తి పూడూరు మండలం కడుమూరు గ్రామానికి చెందిన ఆనందం (హైకోర్టు అడ్వకెట్‌) అనే వ్యక్తికి అత్యంత సన్నిహితుడు. హైకోర్టు అడ్వకేట్‌కు లైసెన్సుతో కూడిన రివాల్వర్‌ ఉంది. అతని రివాల్వర్‌తో ఫొటో దిగి సోషల్‌ మీడియాలలో అప్‌లోడ్‌ చేసినట్లు తెలుస్తోంది. దీనిని గమనించిన కొందరు వ్యక్తులు స్థానిక ఎస్‌ఐ విశ్వజన్‌కు సమాచారం ఇవ్వగా, అతన్ని పోలీస్‌స్టేషన్‌కు రప్పించి కౌన్సెలింగ్‌ ఇచ్చారు. మరోసారి ఇలాంటి ఘటనలకు పాల్పడకూడదని హెచ్చరించారు.

అధ్యాపకులకు న్యాక్‌ అభినందనలు



అధ్యాపకులను అభినందిస్తున్న న్యాక్‌ సభ్యులు

కొడంగల్‌ : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులను న్యాక్‌ బృందం సభ్యులు అభినందించారు. న్యాక్‌ విజిట్‌లో భాగంగా రెండో రోజు శుక్రవారం బృందం సభ్యులు కళాశాలను సందర్శించారు. కళాశాలలో విద్యార్థులతో మాట్లాడారు. కళాశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు ప్రిన్సిపాల్‌ రాజారాం తెలిపారు. ఈ సందర్భంగా న్యాక్‌ పీర్‌ టీమ్‌ చైర్మన్‌ డాక్టర్‌ సిబ్‌నాథ్‌ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని అన్నారు. పీర్‌ టీమ్‌ సభ్యులుగా కేరళ రాష్ట్రానికి చెందిన ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ యాకూబ్‌, దయానంద్‌ సాగర్‌ యూనివర్సిటీ డీన్‌ డాక్టర్‌ సునీల్‌ మోరే ఉన్నారు. త్రిసభ్య కమిటీగా ఉన్న వీరు కొడంగల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పరిశీలించారు. అన్ని విషయాలను తనిఖీ చేసి నివేదిక సిద్ధం చేశారు. వీరు ఇచ్చే నివేదిక ఆధారంగా కళాశాలకు జాతీయ స్థాయిలో గ్రేడును ఇస్తారు. న్యాక్‌ గుర్తింపును ప్రకటిస్తుంది. బీ గ్రేడ్‌ వస్తే రూ.5 కోట్లు, ఏ గ్రేడ్‌, ఏ ప్లస్‌ గ్రేడ్‌ వస్తే రూ.10 కోట్ల నిధులు వస్తాయి. ఈ నిధులతో కళాశాలను అభివృద్ధి పరుస్తారు. కార్యక్రమంలో అధ్యాపకులు రఫియా ఖానం, రాంబాబు, శ్రీనివాస్‌, రమేశ్‌బాబు, సోమ్లు తదితరులు ఉన్నారు.

పల్లె వనాన్ని పరిశీలించిన కేంద్ర బృందం




తొర్మామిడి పల్లె ప్రకృతి వనంలో కేంద్ర బృందం సభ్యులు తదితరులు

బంట్వారం: మినిస్టర్‌ ఆఫ్‌ రూరల్‌ డెవలప్‌మెంట్‌ (ఎంఓఆర్డీ) కేంద్ర బృందం శుక్రవారం బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు గంగయ్య, లోకేశ్‌లు తొర్మామిడి పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. అదే గ్రామంలో ఈజీఎస్‌ కింద సాగు చేసిన జామ తోటను పరిశీలించి రైతు సుభాష్‌తో మాట్లాడారు. అక్కడి నుంచి కమ్యూనిటీ ప్లాంటేషన్‌లోని మొక్కలను చూశారు. కోట్‌పల్లి మండలం కరీంపూర్‌, జిన్నారం, రాంపూర్‌ గ్రామాల్లో పల్లె ప్రకృతి వనంతో పాటు పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో డీపీఎం నర్సయ్య, అడిషనల్‌ డీఆర్‌డీఓ స్టీవెన్‌నీల్‌, తొర్మామిడి సర్పంచ్‌ స్ఫూర్తి, బంట్వారం ఎంపీడీఓ బాలయ్య, ఏపీఓ సుధాకర్‌, ఈసీ శ్రీనివాస్‌, టెక్నికల్‌ అసిస్టెంట్‌ జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పశువుల పాకలుగా బస్‌షెల్టర్లు

వేల రూపాయలు వెచ్చించి గ్రామీణ ప్రాంత ప్రయాణికుల కోసం నిర్మించిన బస్‌షెల్టర్లు నిరుపయోగంగా మారాయి. చిన్నపాటి మరమ్మతులు చేస్తే ప్రజలకు ఉపయోగపడతాయని తెలిసినా ఆ దిశగా అధికారులు, పాలకులు చొరవ చూపడం లేదు.

- అక్కడే మద్యం సేవిస్తున్న ఆకతాయిలు
- అపరిశుభ్రత కారణంగా అడుగుపెట్టని ప్రయాణికులు
- చెట్ల కిందే బస్సుల కోసం నిరీక్షణ
- పట్టించుకోని అధికారులు



ఎన్కెపల్లి బస్‌షెల్టర్‌లో మేకల మంద

బంట్వారం: నిర్వహణ లోపం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్టీసీ బస్‌షెల్టర్లు దయనీయంగా మారాయి. అయినా సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిసున్నారు. దీంతో వేసవిలో ప్రయాణికులకు చెట్ల నీడే దిక్కవుతోంది. కోట్‌పల్లి మండలం ఎన్కెపల్లి, జిన్నారం బస్‌షెల్టర్లు పశువుల పాకలుగా మారాయి. వీటిలో మేకలను ఉంచుతున్నారు. దీంతో బస్‌షెల్టర్లు అపరిశుభ్రంగా మారి ప్రయాణికులు కూర్చోవడానికి వీలులేకుండా పోయాయి. దాదాపు ఐదేళ్ల క్రితం మోత్కుపల్లి గేటు, బార్వాద్‌ తండా, రాంపూర్‌, ఓగులాపూర్‌, నాగసాన్‌పల్లి, ఎన్నారం, అలాగే బంట్వారం మండలంలోని యాచారం గేటు వద్ద బస్‌షెల్టర్లు నిర్మించారు. అయితే వాటి నిర్వహణను గాలికి వదిలేయడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. కొన్ని చోట్ల పట్టపగలే బస్‌షెల్టర్లలో కూర్చుని మందు కొడుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. తాగడమే కాకుండా ఖాళీ బాటిళ్లను సైతం అక్కడే పగులగొడుతున్నారని అంటున్నారు. అసలే చెత్తాచెదారంతో నిండి ఉండే షెల్టర్లు ఆపై మందు బాబులకు కేంద్రాలుగా మారడంతో ప్రయాణికులు అక్కడికి వెళ్లాలంటేనే జంకుతున్నారు. వర్షం వస్తే కూడా తడుస్తూ చెట్ల కిందే బస్సులు, ఆటోల కోసం నిరీక్షిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదేవిధంగా పోలీసులు అప్పుడప్పుడ గస్తీ నిర్వహిస్తే బస్‌షెల్టర్లలో అసాంఘిక కార్యకలాపాలకు చెక్‌ పెట్టవచ్చని పలువురు అంటున్నారు.



వినియోగంలో లేని బార్వాద్‌ తండా బస్‌షెల్టర్‌